



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్

శనివారం 31 జనవరి 2026 పేజీలు 8


# ముగిసిన మున్సిపల్ నామినేషన్ల పర్వం



భారీ ర్యాలీతో బయలు దేరిన చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థులు



భారీ ర్యాలీతో బయలు దేరిన చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థులు



భారీ ర్యాలీతో బయలు దేరిన చేవెళ్ల బీజేపీ అభ్యర్థులు

- మూడు రోజులు.. 962 నామినేషన్లు
- అత్యధికంగా 244 నామినేసన్లు షాద్‌నగర్‌లోనే
- చివరి రోజు భారీగా దాఖలైన నామినేషన్లు
- నామినేషన్ ప్రక్రియలో పోటా పోటీగా ర్యాలీలు
- నేడు అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్, కలెక్టర్

**రంగారెడ్డి, మేజర్ న్యూస్ (జనవరి 30) :** మున్సిపల్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు కావడంతో జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు భారీ ర్యాలీలతో తరలి వచ్చి నామినేషన్లను సమర్పించారు. దీంతో మున్సిపల్ పోరులో తొలి ఘట్టం పూర్తయింది. మూడో రోజుల పాటు 962 నామినేసన్లు దాఖలయ్యాయి. నామినేషన్ తిరస్కరణకు గురైన అభ్యర్థులకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ఎ న్నికల సంఘం (ఎస్ఈసీ) మార్గదర్శకాలు జారీ చేసింది. ఫిబ్రవరి 1న అప్పీళ్లు స్వీకరించగా, వాటిపై ఫిబ్రవరి 2న అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. అభ్యర్థుల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించారు. అదే రోజు రిటర్నింగ్ అధికారులు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. దీంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల పూర్తి స్పష్టత రానుంది.



16వ వార్డుకు నామినేషన్ వేస్తున్న దేవర సమతా వెంకట్‌రెడ్డి



15వ వార్డుకు నామినేషన్ వేస్తున్న బండారి శైలజా ఆగిరెడ్డి

**మొత్తం 962 నామినేషన్లు..**

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మూడు రోజుల పాటు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. జిల్లాలోని 6 మున్సిపాలిటీలు 126 వార్డుల్లో అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. మూడు రోజుల పాటు మొత్తం 962 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా షాద్‌నగర్ మున్సిపాలిటీలో

మిగతా 3లో

## స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలపై పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్నికల నియమావళి అమలులో నిర్లక్ష్యం వద్దు
- సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి, ఐఏఎస్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 30):** మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి, ఐఏఎస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న మున్సిపాలిటీలలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సంబంధిత రిటర్నింగ్ అధికారులను పరిశీలకులు ఆదేశించారు. స్ట్రాంగ్ రూంల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, కౌంటింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, ప్రవేశ?నిష్క్రమణ మార్గాల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు సాంబశివరావు, సుగుణబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వార్తలపై ప్రత్యేక నిఘా ఉంచాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ సెంటర్ ప్రారంభం



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 30):** 2వ సాదారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల వార్తలపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని

మిగతా 3లో

## మున్సిపల్ ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



5లో

## బిల్‌కల్‌లో యువకుని దారుణ హత్య



7లో

# ముగిసిన మున్సిపల్ నామినేషన్ల పర్వం

**మొదటిపేజీ తరువాయి...**

244 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకిరించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో పోటీ చేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేసేందుకు తరలి రావడంతో సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ కేంద్రంలోకి వచ్చిన అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించారు. రాత్రి వరకు నామినేషన్లను స్వీకరించారు. చేవెళ్లలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను చేవెళ్ల డీసీపీ పరిశీలించారు.

**పోటా పోటీగా ర్యాలీలు..**

నామినేషన్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు పోటా పోటీగా ర్యాలీలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ 15, 16 వార్డు అభ్యర్థులు దేవర సమతావెంకట్‌రెడ్డి, బండారి శైలజా ఆగిరెడ్డి చేవెళ్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర దేవాలయం నుంచి గ్రామంలోని నామినేషన్ కేంద్రం వరకు పెద్ద ఎత్తునా ర్యాలీ నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి బీఆర్ఎస్ ర్యాలీలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు వేంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి నామినేషన్ కేంద్రానికి ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో బీజేపీ అభ్యర్థులు పెద్ద ఎత్తునా ర్యాలీ నిర్వహించారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం డీజే సౌండ్ మధ్యన ర్యాలీగా వచ్చి నామినేషన్లను సమర్పించారు.

**ఫిబ్రవరి 11న పోలింగ్..**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్. జరగనుండగా ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13న నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోని మున్సిపల్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

**నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అబ్జర్వర్, కలెక్టర్**

జిల్లాలోని చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి పరిశీలించిరు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలు రిజస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని తెలిపారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విదుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామినేషన్ పత్రాలు దాఖలుచేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

**నేడు నామినేషన్ల పరిశీలన : జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందిగా చేపట్టాలని, నామినేషన్ల స్వీకరణలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని, సాయంత్రం 5 గంటలకు గేట్ మూసి వేయాలని, గేటు లోపల ఉన్న వారికి టోకెన్ అందజేసి వరుస క్రమంలో నామినేషన్లు స్వీకరించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్ల స్వీకరణ కోసం టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపర్చాల్సిన పత్రాలు, ఇతర వివరాల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నామినేషన్ దరఖాస్తులు పూర్తి చేసిన అబ్యర్థులు హెల్ప్‌డెస్క్‌వద్ద పరిశీలించుకుని సరైన నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. 31వ తేదీనా నామినేసన్లు పరిశీలించి అర్హతగల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదిన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదినా నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థులు తుది జాబితా ప్రకటన వెలువడుతుందని తెలిపారు. ఫిబ్రవరి11న పోలింగ్, 12న రీపోలింగ్,(మైనా ఉన్నట్లయితే), 13వ తేది ఓట్ల లెక్కిపు ప్రక్రియ చేపట్టి విజయం సాధించిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 9849906949 ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదుల కోసం సంప్రదించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో వెంకట్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**మూడు రోజుల పాటు దాఖలైన నామినేషన్ల వివరాలు**

| మున్సిపాలిటీ | వార్డులు | అభ్యర్థులు | నామినేషన్లు |
|---|---|---|---|
| ఆమనగల్లు | 15 | 60 | 109 |
| చేవెళ్ల | 18 | 71 | 133 |
| ఇబ్రహీంపట్నం | 24 | 115 | 192 |
| మొయినాబాద్ | 26 | 101 | 184 |
| షాద్‌నగర్ | 28 | 180 | 244 |
| శంకర్‌పల్లి | 15 | 52 | 100 |
| మొత్తం | 126 | 579 | 962 |

**పార్టీల వారీగా ఇలా..**

| | |
|---|---|
| బీఎస్పీ | 04 |
| కాంగ్రెస్ | 348 |
| ఏఐఎంఐఎం | 04 |
| బీఆర్ఎస్ | 280 |
| బీజేపీ | 195 |
| ఇతర పార్టీలు | 26 |
| ఇండిపెండెంట్ | 33 |

# ఎల్లంపేటలో కాంగ్రెస్ జెండా ఎగరవేత ఖాయం

- మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం
- డీసీసీ మాజీ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి



**మేడ్చల్, మేజర్ న్యూస్ (జనవరి 30):** ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుచుకొని మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తుందని డీసీసీ మాజీ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని డబిల్‌పూర్ గ్రామం 14వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎల్లంపేట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ నేతల భూకబ్జాలు, బూటకపు రాజకీయాలు ఇక కొనసాగవని విమర్శించారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 24 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుచుకొని మున్సిపాలిటీపై పట్టు సాధిస్తుందని పేర్కొన్నారు. డబిల్‌పూర్ గ్రామంలోని 14వ వార్డును ఆదర్శ వార్డుగా అభివృద్ధి చేస్తామని, గత కొన్ని సంవత్సరాలుగా గ్రామానికి సరైన నిధులు రాక అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. రానున్న రోజుల్లో అధిక నిధులు తెచ్చి ఎల్లంపేట మున్సిపాలిటీని ఆదర్శంగా నిలుపుతామని హామీ ఇచ్చారు. అధిక సంఖ్యలో వార్డులు గెలుచుకొని చైర్మన్ పదవిని ముఖ్యమంత్రికి బహుమతిగా అందిస్తామని, పార్టీకి ప్రతి కార్యకర్తే ప్రధాన బలమని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి బాటలు వేస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ దేవా, సల్ల వెంకటేష్, మునిగొండ శేఖర్, శ్రీరామ్ రెడ్డి, ముత్యాల గౌడ్, సంజీవరావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్లంపేటలో చివరి రోజున ఊపందుకున్న నామినేషన్లు

- మొత్తం నామినేషన్ లు: 209
- ఎల్లంపేటలో రాజకీయ వేడి



**మేడ్చల్, మేజర్ న్యూస్ (జనవరి 30):** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో నామినేషన్ల స్వీకరణకు మూడవ రోజు, చివరి రోజు కావడంతో ఎన్నికల వాతావరణం రాజకీయ వేడితో నిండింది. నామినేషన్లకు చివరి రోజుగా ఉండటంతో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి భారీ ర్యాలీలతో నామినేషన్ కేంద్రాలకు చేరుకోవడంతో కేంద్రాలు ఉదయం నుంచే సందడిగా మారాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఈ చివరి రోజున మొత్తం 209 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

# అలియాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 144 నామినేషన్లు దాఖలు

## అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి చంద్రశేఖర్

**శామీర్ పేట, మేజర్ న్యూస్ ( జనవరి 30):** మూడు రోజుల నామినేషన్ల లో భాగంగా శుక్రవారం ముగిసిన నామినేషన్ల ప్రక్రియ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటీ లో 20వార్డులకుగాను 28వ తేది నుంచి 30 వ తేది వరకు మూడు రోజులలో జరిగిన నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 94మంది అభ్యర్థులు, మొత్తం 144 నామినేషన్లు దాఖలయ్యాయని కాంగ్రెస్ నుంచి 47 , బిఆర్ ఎస్ పార్టీ నుంచి 38 , బిజెపి 31 , సీపీఎం నుంచి 2 – జనసేన పార్టీ నుంచి 8, ఏ ఐ ఎఫ్ బి నుంచి రెండు, బి ఎస్ పి 4, ఇతరులు 12 నామినేషన్లు వేశారని శుక్రవారం అలియాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

# ఎన్నికల వార్తలపై ప్రత్యేక నిఘా ఉంచాలి

**మొదటిపేజీ తరువాయి...**

డీపీఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజేశ్వరి,అదనపు కలెక్టర్ సుదీర్ లతో కలిసి మీడియా సెంటర్ ను ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే రాజకీయ వార్తలపై పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. దినపత్రికలు, స్థానిక ఛానళ్లలో వచ్చే వార్తలను నిశితంగా గమనించాలని, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉండే అంశాలను వెంటనే గుర్తించాలని సూచించారు. అనుమానిత పెయిడ్ న్యూస్ పై ప్రత్యేక దృష్టి సారించి, వాటి వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మీడియా సెంటర్‌కు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్ లను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ వాసుచంద్ర, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, ఇ డి ఎస్సి కార్పోరేషన్ బాబు మోసెస్ ,అసిస్టెంట్ పి ఆర్ ఓ ప్రభాకర్, తహసిల్దార్ ఆనంద రావు , కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనవరి 30):** మేడ్చల్ నియోజకవర్గం, అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపాలిటీలపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడిందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న కాంగ్రెస్ పాలన ప్రజల మద్దతుతో విజయవంతమవుతుందని అన్నారు. పార్టీ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, వారి అంకితభావమే కాంగ్రెస్ బలమని తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. వార్డ్ ఇంచార్జ్‌లు క్షేత్రస్థాయిలో ప్రజలతో నిత్యం మమేకమై పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే కీలక బాధ్యత నిర్వర్తిస్తున్నారని, వారి సమన్వయంతోనే ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలు, మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ సంక్షేమ పాలనకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, అదే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి బాటలు వేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్,కందాడి అంజి రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు తుంకి రమేష్,పార్టీ వార్డ్ ఇంచార్జ లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

**కొడంగల్, మేజర్‌న్యూస్ (జనవరి 30):** సమక్క, సారక్క జాతరకు వెళ్తున్న సమయంలో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని ఉద్దేశించి నీ సంగతి చూస్తా పోబే అని, పీ సీ గాడు తుర్కోడు అని ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా వివాదానికి దారి తీశాయని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రసిడెంట్ మొహ్మద్ వసీమ్, వికారాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మొహ్మద్ ముస్తఫా అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధి బాధ్యాతయుతంగా ప్రవర్తించాల్సిన సమయంలో ఓ వర్గాన్ని కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలను కాపాడే పోలీసు అధికారులను మతం, వర్గం ఆధారంగా లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయనను పార్టీ నుంచి సస్పెన్షన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

## అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**కొడంగల్, మేజర్ న్యూస్ (జనవరి 30):** కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, కురుమ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.నాగప్పతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు రూ.20 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు వీరన్న, సర్పంచ్ అంజిలప్ప, మాజీ సర్పంచ్ నర్సిములు, వార్డు సభ్యులు ఆనందమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 31తేది సీఎం కప్ క్రీడ పోటీలను విజయవంతం చేయండి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు

**దౌల్తాబాద్, మేజర్ న్యూస్(జనవరి 30):** మండలంలోని విద్యార్థి విద్యార్థులకు ,యువతి యువకులకు 31'01-2026 తేదీ నా దౌల్తాబాద్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు తెలిపారు. కో కో' కబడ్డీ అథ్లెటిక్స్ వాలీబాల్ లాంటి క్రీడ క్రీడా పోటీలను నిర్వహించబడనని ఈ పోటీలో ఇంతకుముందు ఆన్లైన్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే అర్హులన్నారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసిన పేపర్ తప్పకుండా తీసుకొని రావాలని తెలిపారు. ఉదయం 9 గంటల లోపు అన్ని టీంల వివరాలనుదౌల్తాబాద్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో రిపోర్ట్ చేసుకోవాలని పిటి శ్రీలత తెలిపారు.

## గ్రామ అభివృద్ధిలో విషయంలో రాజీ పడబోము

- దశలవారీగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం
- కోల్కొంద సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ





**వికారాబాద్, మేజర్ న్యూస్ (జనవరి 30):** గ్రామ అభివృద్ధి విషయంలో రాజీ పడబోమని కోల్కొంద సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలంలోని కోల్కొంద గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తనకు తెలిపితే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సృజన సాహిత్య, ఎంపీ ఓ యాదగిరి, ఆర్ ఐ సరిత , ఏపీవో శంకరయ్య, ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జనార్దన్ , వార్డు మెంబర్లు, వివిధ మండల శాఖల అధికారులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడు తాళ్ల జగదీష్ గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



శామీర్‌పేట్, మేజర్ న్యూస్ (జనవరి 30): ఇటీవల ప్రమాదానికి గురైన తెలంగాణ ఉద్యమకారుడు తాళ్ల జగదీష్ గౌడ్‌ను శుక్రవారం మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కాలంలో జగదీష్ గౌడ్ చేసిన సేవలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తల వెంట బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రస్తుత ఎన్నికల పరిస్థితులపై సమీక్ష నిర్వహించి, పార్టీ బలోపేతంపై నాయకులతో చర్చించారు.ప్రమాదానికి గురైన కార్యకర్తను వ్యక్తిగతంగా పరామర్శించడం ద్వారా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తన మానవీయ కోణాన్ని మరోసారి చాటుకున్నారని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్ రెడ్డి, అరుణ్ రావు, మాజీ జడ్పీటీసీ బెస్త వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ మార్గమే దేశానికి శాశ్వత దారి

### అహింస, సత్యమే భారత భవిష్యత్తు: గరిసెల సురేందర్ ముదిరాజ్



మేడ్చల్, మేజర్ న్యూస్ (జనవరి 30): మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్, కండ్లకొయ్యలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్మా గాంధీ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. గాంధీజీ చూపిన బాటలో నడిచినప్పుడే సమాజంలో శాంతి, సమానత్వం, సామాజిక న్యాయం సాధ్యమవుతాయని తెలిపారు.దేశ ప్రజలందరూ గాంధీజీ సిద్ధాంతాలను తమ జీవితాల్లో అమలు చేయాలని, ముఖ్యంగా యువత గాంధీ ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రోల్ల స్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీరస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు కర్రోల సంతోష్, దామన్న గారి జయరాజ్‌లు పాల్గొని గాంధీజీ విగ్రహానికి ఘన నివాళులర్పించారు.

## గాంధీ మార్గం స్ఫూర్తిదాయకం

### అన్నోజిగూడలో గాంధీ వర్ధంతికి ఘన నివాళులు



**ఘట్కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (జనవరి 30):**ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో మహాత్మాగాంధీ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బద్దం యాదిరెడ్డి, పోచారం మాజీ ఉపసర్పంచ్ ఆకిటీ బాల్ రెడ్డి, నాయకులు తుకారాం, రమేష్ కుమార్, గాంధి, బలరాం, శివ తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ బోధించిన అహింస, సత్యం, సేవా భావం నేటి తరానికి ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో శుక్రవారం గాంధీ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు యాదవ్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏర్పాటుచేసిన గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. వెంకటేష్ ముదిరాజ్, సగ్గు అనిత, ఆంజనేయులు యాదవ్, ప్రభాకర్ రెడ్డి, భాను, ప్రదీప్ రెడ్డి, రహీం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## విదేశీ విద్యకు మరింత వెసులుబాటు

- అంబేద్కర్ ఓవర్సీస్ పథకంలో సీట్లు 500కు పెంపు
- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 30): తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకాన్ని మరింత విస్తరించి, ప్రతి సంవత్సరం కేటాయించే సీట్లను 210 నుంచి 500కు పెంచినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్ తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్యలో మరింత అవకాశాలు లభిస్తాయని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ విద్యార్థినీ విద్యార్థులు 2026 ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖా స్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఇ-పాస్ వెబ్‌సైట్ (www.tgepass.cgg.gov.in) ద్వారా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పథకానికి సంబంధించిన అర్హతలు, అవసరమైన పత్రాలు, ఇతర పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్ కోరారు.

## అలియాబాద్‌లో బీఆర్ఎస్ జోష్

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఎంట్రీతో కార్యకర్తల్లో ఉత్సాహం



శామీర్‌పేట, మేజర్ న్యూస్ (జనవరి 30): అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మల్కాజ్‌గిరి శాసనసభ్యులు, అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజల మద్దతు కోరారు. ఈ సందర్భంగా లాల్‌గడి మలక్‌పేట్ ప్రాంతంలో 6వ వార్డు (తలారి కృష్ణ), 16వ వార్డు (చిదు వనజ శ్రీనివాస్ రెడ్డి), అలియాబాద్‌లో 7వ వార్డు (దాసరి నరసింహ), 8వ వార్డు (బండి రామ్ రెడ్డి), 20వ వార్డు (బోయిని రోజా రాజు), అలాగే తుర్కపల్లిలో 3వ వార్డు (దాసరి రవి), 4వ వార్డు (జీడిపల్లి కవిత జనార్దన్ రెడ్డి), 13వ వార్డు (యూసఫ్ బాబా) ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు.ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రాష్ట్రంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాల వల్ల అన్ని వర్గాలకు లాభం చేకూరిందని పేర్కొన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్‌లో పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు, మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, రావుల అంజయ్య, జె.ఏ.సి. వెంకన్న, మురుగేష్, రాము యాదవ్, లక్ష్మణ్ యాదవ్, అరుణ్ రావు, వంగ వెంకట్ రెడ్డి, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, ఉస్మాన్, శివ గౌడ్, సుమన్ గౌడ్, సాయి గౌడ్, నవీన్ రాజ్, రాజేష్, శంకర్ రావు, శ్రీనివాస్, హేమంత్ పటేల్, సాయినాథ్, మోసిన్, శ్రీధర్ గౌడ్, లత తదితరులు పాల్గొన్నారు.

## అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(జనవరి, 30):** పోచారం డివిజన్ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలో అడ్డగోలు నిర్మాణాలతో ఇబ్బందులు తలెత్తుతోందని వెంటనే నిలుపుదల చేయాలని ఆ కాలనీవాసులు డిప్యూటీ కమిషనర్ వాణిని కోరారు. ఈ మేరకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. బ్లాక్ 21 భవనానికి ఇరువైపులా ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారని, దీంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని దీని ద్వారా ఇతర సమస్యలు ఉత్పన్న మవుతుందని ఆ కట్టడాలను తక్షణమే నిలిపివేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎల్లమ్మ, బలరాములు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



## వివేకానంద జూనియర్ కళాశాల వీడ్కోలు వేడుకలు

**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(జనవరి, 30):** ఘట్‌కేసర్‌లోని వివేకానంద జూనియర్ కళాశాల వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల డైరెక్టర్ చిందం వెంకటేష్, హైకోర్టు న్యాయవాది చందుపట్ల జీవన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తాండూరు మున్సిపల్ పై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేస్తాం

- తాండూరు టౌన్ అభివృద్ధికి వెయ్యి కోట్లు తెస్తాం.
- మళ్లీ మున్సిపల్ కు జెంగిల్ రాజును రానివ్వం.
- తమ ఉనికి కోసమే బిఆర్ఎస్ పార్టీ ఆరాట పడుతుంది.
- మాజీ ఎమ్మెల్యే పైలట్ ఈ ప్రాంతాన్ని నాశనం చేశాడు.
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడి.






**తాండూరు మేజర్ న్యూస్(జనవరి 30):** తాండూరు మున్సిపల్ పై ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేస్తాం అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.తాండూరు మున్సిపల్ లో నమోనేషన్ ల చివరి రోజైన శుక్రవారం నాడు తమ పార్టీ అభ్యర్థులతో నామినేషన్ వేసిన తర్వాత మీడియా పాయింట్ దగ్గర మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ లో ఉన్న 36 వార్డులల్లో 30 స్థానాలు గెలుపొంది కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేస్తాం అని ఆయన పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో తాండూరు మునిసిపల్ కు వెయ్యి కోట్ల నిధులు తెస్తామని ఆయన పేర్కొన్నారు.తాండూరు పట్టణ రూపురేఖల్ని మార్చడమే తన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు తెచ్చి ప్రతి వార్డులో ఎంతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.గతంలో బిఆర్ఎస్ పార్టీ హయాంలో ఐదేళ్ళ పాటు కుర్చీ కోసం ఆధిపత్యం కోసం కొట్లాడి ఎలాంటి అభివృద్ధి చేయకుండా తాండూరును భ్రష్టు పట్టించాడని ఆయన అన్నారు.మళ్లీ అలాంటి జెంగిల్ రాజ్ వ్యవస్థను రానివ్వనని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.ఐదేళ్ళ పాటు తాండూరుకు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, ఆయన హయాంలో అరాచకాలు,గంజాయి రవాణా సాగిందని,యువతను చెడు దారుల్లో పట్టించాడని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ హయాం లోన్ అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని,ఉదాహరణగా టౌన్ లోని ప్రతి వార్డులో ఎక్కడ చూసిన సీసీ రోడ్లు,డ్రైనేజీ నిర్మాణాలు సాగుతున్నాయని ఆయన గుర్తుచేశారు.త్వరలోనే తాండూరు పట్టణానికి కాగ్నా నీటిని అందించనున్నట్లు,ఇందుకు గాను కొత్త పైప్ లైన్ నిర్మాణానికి నిధులు వచ్చాయని ఆయన తెలిపారు.తాండూరు అంటే కాంగ్రెస్ అడ్డా అని దీనిని ఎవరు మార్చలేరని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్ గా ఎవరిని నియమిస్తారని విలేకరులు అడగగా ఆ విషయాన్ని పార్టీ అధిష్టానం చూసుకుంటుందని ఆయన అన్నారు.ఈ ఎన్నికల్లో పోటీ చేసే 36 మంది అభ్యర్థులకు పార్టీ తరపున బీఫారాలు అందించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు:రవి గౌడ్,మురళి కృష్ణ గౌడ్,నర్సింహులు,బంటు వేణు,అప్పు,అబిబ్ లాలా,గౌరీ రాములు,సుభాన్ రెడ్డి,ప్రభాకర్ గౌడ్,సాజిద్ అలీ,మహిళా నాయకురాళ్లు:స్వప్న,నీరజ బాల్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత బాల్యమే లక్ష్యం... సేఫ్ విలేజ్‌తో అవగాహన

- బాల హక్కులు తెలుసుకుంటేనే భద్రమైన భవిష్యత్ : ఎస్సై లక్ష్మణ్
- కీసర జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం





**కీసర,మేజర్ న్యూస్:**కీసర మండల పరిధిలోని కీసర జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో గో ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేఫ్ విలేజ్ అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బాల్య వివాహాలు, బాల అక్రమ రవాణా, బాల కార్మికత్వం, బాలలపై దుర్వినియోగం వంటి సామాజిక సమస్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అలాగే సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీసర పోలీస్ స్టేషన్ ఎస్సై లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. పిల్లలు తమ హక్కులను తెలుసుకుని, ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను లేదా సంబంధిత అధికారులను సంప్రది ంచాలని సూచించారు. చట్టాలపై అవగాహనతోనే విద్యార్థులు తమను తాము రక్షించుకోగలరని పేర్కొన్నారు. ఈ సందర్భం గా మై చాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థికి కామిక్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌కు కీసరగుట్ట మహాశివరాత్రి ఆహ్వానం

- బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని వినతి



**కీసర,మేజర్ న్యూస్:** ఫిబ్రవరి 15న జరగనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కీసరగుట్టలో ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు నిర్వహించనున్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను దేవస్థాన నిర్వాహకులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈవో) కట్ట సుధాకర్ రెడ్డి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి మహాశివరాత్రి, బ్రహ్మోత్సవాల అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపార్య ధర్మకర్తలు రమేష్ శర్మ, ఉమాపతి శర్మ, కీసర మాజీ ఉప సర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మతో పాటు అభిలాష్, వెంకట చారి పాల్గొన్నారు. కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తుల భాగస్వామ్యంతో సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, మహాశివరాత్రి సందర్భంగా జరిగే బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ, దేవస్థాన అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 30):** వికారాబాద్ జిల్లాలో జరగనున్న నాలుగు మున్సిపాలిటీల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మరియు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు.ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం, అవాస్తవ వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు లేదా అసత్య ప్రచారాలు చేస్తే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలను విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మరియు సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు అత్యంత బాధ్యతా యుతంగా వ్యవహరించాలని, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే మెసేజ్‌లు, వీడియోలు లేదా పోస్టులను ప్రోత్సహి ంచవద్దని సూచించారు. ఏ సమాచా రాన్ని ఇతరులకు ఫార్వార్డ్ చేసే ముందుదాని నిజానిజాలను నిర్ధారిం చుకోవాలని, అభ్యంతరకర కంటెంట్ విషయంలో గ్రూపు అడ్మిన్లు తక్షణమే వాటిని తొలగిం చాలని తెలిపారు.జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఆమె కోరారు.

# కుష్టు వ్యాధి లక్షణాలపై విద్యార్థులకు అవగాహన

**మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్**



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (జనవరి 30):** కుల్కచర్ల మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి లక్షణాలు తెలుపుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి సంక్రమించినట్లు భావించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్టు రోగుల పట్ల వివక్ష చూపకుండా కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ హాస్టల్ వార్డెన్ సుందర్ రాజు, హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య ఆశ కార్యకర్తలు సునీత, స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం: ఎస్ఐ విఠల్ రెడ్డి



**యాలాల్ మేజర్ న్యూస్ (జనవరి 30)** అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా యలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు బాగాయిపల్లి చౌరస్తాలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులను గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు.అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ విఠల్ రెడ్డి హెచ్చరించారు...

సూర్య
www.suryaa.com
శనివారం
31 జనవరి 2026

## సైబర్ నేరాల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై వెంకటేశ్వర్ గౌడ్



**లింగాల,సూర్య న్యూస్:** సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఎం సి తండాలో సర్పంచ్ నిరంజన్ అధ్యక్షతన సైబర్ నేరాలు అరికట్టడం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలు పెరిగిన ప్రస్తుత కాలంలో సెల్ఫోన్లో వాడకం పెరిగిందని అన్నారు. ప్రతిదీ సెల్ ఫోన్ నెంబర్ కు లింకు ఉండడంతో సైబర్ నేరగాళ్లు ఏదో లేనిపోని ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు.ఆపద సమయంలో సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930కు 100కు గాని ఫోన్ చేసి పోలీస్ ఇతర శాఖల యంత్రాంగం సేవలను పొందాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని అన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాము, సర్పంచ్ నిరంజన్, డిప్యూటీ సర్పంచ్ జ్యోతి వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు నిరంజన్, నాను, శక్రు,సీతారాం, పీరు, ఉమ్లా యువకులు వసంత్,సురేష్, రవి, రాజు,లింగం తదితరులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు యూరియా కొనుగోలు చేయాలి

### -మండల వ్యవసాయ అధికారి ఏవో డాకేశ్వర్ గౌడ్



**చిన్నంబావి/ సూర్య మేజర్ న్యూస్ :** చిన్నంబావి మండలం లో రైతులు యూరియా యాప్ బుకింగ్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలి. రైతులు ముందస్తుగా యూరియా బ్యాగులను యాప్లు బుక్ చేసుకోవాలి. తనకు దగ్గరలో ఉన్న డీలర్లతోపాటు జిల్లాలో ఎక్కడైనా కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది. యాప్ ద్వారా మండలాలలో డీలర్ల వద్ద ఉన్న యూరియా బ్యాగుల సమాచారం తెలుసుకోవచ్చు. మొబైల్ నెంబరు, పట్టా పాస్ బుక్ నెంబర్ సహాయంతో యాప్ లో యూరియా బుక్ చేసుకోవచ్చు. బుక్ చేసుకున్న వెంటనే తన మొబైల్ నెంబర్ కు సమాచారంతోపాటు బుకింగ్ కోడ్ నెంబర్ వస్తుంది. ఆ కోడ్ నెంబరు చెప్పి తన బుక్ చేసుకున్న డీలర్ వద్ద 24 గంటల లోపు యూరియా బ్యాగులు కొనుగోలు చేసుకోవాలి. ఒక ఎకరం వరకు విస్తీర్ణం ఉన్న రైతులకు ఒకేసారి, 5 ఎకరాలు ఉన్న రైతులకి రెండు దపాలలో వారికి సరిపడా బ్యాగులు అందించబడతాయి. యూరియా కొరకు క్యూలైన్లో వేచి ఉండడం ఉండదు. ఈ యాప్ గురించి గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ప్రతిఫర్టిలైజర్ షాపుల దగ్గర ఒక వాలంటారని నియమించడం జరుగుతుంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూసుకోవడం జరుగుతుంది. ప్రతి రైతు కూడా సహకరించగలరని వ్యవసాయ శాఖ తరపున కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఏవో డాకేశ్వర్ గౌడ్, ఏఈఓ అరుణ మరియు రైతులు ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

## హాకీయు 17 బాలుర విభాగంలో తెలంగాణ జట్టుకు ఎంపికైన కేతావత్ సంతోష్



**పెద్దమందడి సూర్యన్యూస్:** పెద్దమందడి మండలం అనకాపల్లి తాండకు చెందిన కేతావ త్ సంతోష్ 17 బాలుర విభాగంలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో సంతోష్ ప్రతిభ కనబరిచి ఈ అవకాశం దక్కించుకున్నారు గిరిజన ప్రాంతానికి చెందిన క్రీడాకారుడిగా రాష్ట్రస్థాయిలోగుర్తింపు పొందడం గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు సంతోష్కు గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ రాందాస్ నాయక్ బిఎస్ఎఫ్ కానిస్టేబుల్ దేవుళ్ళ నాయక్ గోపాల్ నాయక్ యువజన సంఘం సభ్యులు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు

## కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**నారాయణ పేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు ఈ సందర్భంగా ఆమె కంట్రోల్ రూమ్ యొక్క పనితీరును పరిశీలించారు. సంబంధిత అధికారులు తో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అధికారులకు అందించాలని అన్నారు. కంట్రోల్ రూమ్‌కి ఏవీ అయినా ఫిర్యాదుల వచ్చినయ అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి సాయిబాబా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి హామీ చట్టంపై కేంద్రం కుట్రలు : ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**ఉప్పునుంతల సూర్యన్యూస్:** జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ గురువారం ఉప్పునుంతల మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలకు ఉపాధి కల్పించి ఆర్థిక భరోసా అందించాలనే లక్ష్యంతో డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం, యూపీఏ చైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ చొరవతో 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈ చట్టాన్ని 2006 ఫిబ్రవరి 2 నుంచి అమలు చేశామని తెలిపారు. ఈ పథకం పేదరికం, నిరుద్యోగం, వలసలు తగ్గించడంతో పాటు మహిళ--పురుష వేతన అసమానతలను తగ్గించి అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడిందని అన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల ఉపాధి కల్పించి కనీస వేతనం అందించడం ఈ చట్టం ప్రధాన లక్ష్యమని వివరించారు. గత 20 సంవత్సరాలుగా రాష్ట్రంలో సుమారు 90 శాతం మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని, అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఉపాధి పొందిన వారిలో 62 శాతం మహిళలే ఉండటం ఈ పథకం సామాజిక ప్రాధాన్యతను చాటుతుందన్నారు. దళితులు, గిరిజనులు, దివ్యాంగులు, చెంచులు వంటి అత్యంత వెనుకబడిన వర్గాలు ఈ పథకం ద్వారా ఎక్కువగా లబ్ధి పొందాయని పేర్కొన్నారు. 2005లో రోజుకు రూ.100తో ప్రారంభమైన ఉపాధి కూలీ ప్రస్తుతం రూ.200 వరకు మాత్రమే పెరిగిందని, ఇప్పటి పరిస్థితుల్లో కనీసం రూ.400 వేతనం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం ప్రవేశపెట్టిన "వికసిత్ భారత్ – రోజ్‌గార్ మరియు అజీవిక మిషన్ గ్రామీణ్ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కొత్త చట్టం ద్వారా ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేయాలనే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి ఉందని ఆరోపించారు. భారతదేశ ఆత్మ గ్రామాల్లో ఉందని విశ్వసించిన మహాత్మా గాంధీ గారి పేరును ఈ పథకం నుంచి తొలగించడం బాధాకరమని, ఇది కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయమని విమర్శించారు. రైతు వ్యతిరేక చట్టాల మాదిరిగానే ఈ చట్టాన్ని కూడా వెనక్కి తీసుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధి హామీ కోఆర్డినేటర్ చత్రు నాయక్, మండల అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ నరసింహారెడ్డి, కాశన్న యాదవ్, కుంద మల్లికార్జున్, గ్రామ సర్పంచ్ చింతగాల శ్రీనివాసులు, యువజన కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న జరిగే సార్వతీక సమ్మెను జయప్రదం చేయండి

### - సీఐటీయూ పట్టణ కార్యదర్శి బి.రాములు



**అచ్చంపేట సూర్య న్యూస్ :** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వతీక సమ్మెను జయప్రదం చేయాలని అనుమతి కోరుతూ అచ్చంపేట మున్సిపాలిటీ శానిటర్ ఇన్స్పెక్టర్ గణేష్ కి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిఐటియు ఆధ్వర్యంలో వారికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కార్యదర్శి బి రాములు సిపిఎం మండల కార్యదర్శి వర్ధశీ సైదులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు రైతులకు ప్రజల కు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికుల పైన ప్రజల పైన పని భారం మోపే విధంగా కుట్ర చేస్తుందని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని మరియు కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ విధానం రద్దుచేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వారు కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ శాఖలో వివిధ భాగాల్లో పని చేస్తున్న కార్మికులను దృష్టిలో పెట్టుకొని ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు కార్మికులు మరణిస్తే దహన సంస్కరణలకు 30 వేల రూపాయలు చెల్లించి కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. కార్మికుడు చనిపోతే వారి కుటుంబంలో మరొకరికి అవకాశం కల్పించాలని కోరారు. మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకి ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇంటి జాగాలు, కేటాయించి వారి సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. పెరుగుతున్న పట్టణ విస్తరణ అనుకూలంగా కార్మికులతో పాటు అదనపు కార్మికులను కూడా నియమించాలని కోరారు పురపాలకలో పనిచేసే కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు మంజూరు చేయాలని మరియు ఆదివారము మరియు పండుగ దినము రోజున సెలవులు మంజూరు చేయాలని కోరారు. మున్సిపాలిటీ సిబ్బంది నాగమ్మ బాలమ్మ, వెంకటయ్య, తిరుపతయ్య ప్రవీణ్, దామోదర్, శంకర్, నవీన్, బాలకృష్ణ, రాజు, మల్లమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పౌరహక్కుల దినోత్సవం



**చిన్నంబావి/ సూర్య మేజర్‌న్యూస్:** లక్ష్మీపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం లో శుక్రవారం ఉదయం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ–ఈనాడు సభ్య సమాజం చాలా మారింది. అందుకు అనుగుణంగా కుల,మత బేధాలు లేకుండా అందరూ కలసి,మెలసి జీవించాలని అన్నారు. ఇప్పటికి ఇంకా ఎవరైనా అంటరానితనం పాటించి కులం పేరుతో దూషించిన,పవిత్ర దేవాలయశీలోకి ప్రవేశం నిషేదించిన,హోటల్లలో రెండు గ్లాసుల పద్దతి పాటించిన మాకు పిర్యాదు చేస్తే పోలీస్ అధికారులతో కలిసి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా మన మండలం లోని కొప్పునూర్ ఎస్సీ బాలుర వసతిగృహం గతంలో ఒకటి,రెండు సార్లు ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. మెనూ ప్రకారం భోజనం పెడుతూ,ఎలాంటి పిర్యాదులు లేకుండా నడపడం గర్వకారణం. అందుకే,మీ పిల్లలు ఎవరైనా ఉంటే,వచ్చే విద్యా సంవత్సరంలో కొప్పునూర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో చేర్పించాలని సూచించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కుల, మత బేధాలు లేకుండా అందరం కలసి, మెలసి ఉన్నప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమన్నారు. చివరగా కొప్పునూర్ ఇంచార్జి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తహసీల్దార్, ఎంపీడీఓ యువ రక్తంతో వచ్చి ఈ సమాజానికి చేతనైనశీత ఏదో మంచి కార్యక్రమం చేయాలని వచ్చారు. మీకు ఏ పని కావాలన్న. వారి సలహా తీసుకొని అభివృద్ధి సాధించాలి. అంటరానితనం ఎవరైనా పాటిస్తే వారిని,పోలీస్ అధికారులను సంప్రదించి మీ ఇబ్బందులను తొలగించుకోవాలని అన్నారు. అనంతరం పోలీస్ శాఖ సిబ్బంది, మెడికల్ సిబ్బంది షెడ్యూల్డ్ కులాల ప్రజలకు, హాస్టల్ విద్యార్థులకు. తాము చేస్తున్న సేవలు వివరించారు. ఈ కార్యక్రమలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ, కొప్పునూర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి,పోలీస్ శాఖ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, రెవిన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది, సర్పంచ్, షెడ్యూల్డ్ కులాల ప్రజలు, తదితరులు హాజరయ్యారు.

## బీసీలను మోసం చేయడంలో అన్ని రాజకీయ పార్టీల ఎజెండా ఒక్కటే

### - బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్



**మక్తల్ సూర్య న్యూస్ :** బీసీలను మోసం చేయడంలో అన్ని రాజకీయ పార్టీల ఎజెండా ఒక్కటేనని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బురుగుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని నేతాజీనగర్‌లోవాకిటి శ్రీనివాస్ ముదిరాజ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ జాగృతి సేన రాష్ట్రఅధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ జెండాలు వేరైనా బీసీలను రాజకీయంగా అణచి వేయడంలో ఒకే ఏజెండా అమలు చేస్తున్నాయని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలచేస్తామని నమ్మించి ఎన్నికలలో బీసీలఓట్లతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికలలో 17 శాతంలోపే బీసీలకు రిజర్వేషన్‌లు అమలు చేసి ఎన్నికలకు వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలను మరో మారు దగా చేశారని, ఓట్ల కోసం బీసీ జపంచేసే, విపక్ష పార్టీలు బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచకుండా లోపాయికారిగా సహకరిస్తున్నాయని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేయకపోయినా సర్పంచ్ ఎన్నికలలో జనరల్ స్థానాలను కైవసం చేసుకొని బీసీ లు అన్ని రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. మున్సిపల్, నగర పాలక సంస్థల ఎన్నికలలో కూడా బీసీలు జనరల్ స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి తగినబుద్ధి చెప్పాలని బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ, లోక్ సభ సీట్ల డీ లిమిటేషన్ ముందే కేంద్ర ప్రభుత్వం బీసీలకు చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని లేనియెడల వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్ యాదవ్, వాకిటి శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అరవింద్ స్వామి,సిరిపే వెంకటేష్ ముదిరాజ్, సునీల్ యాదవ్, నరేందర్, నవీన్ యాదవ్, రాము, తదితరులు పాల్గొన్నారు

## 17వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఎదిరే పద్మ కృష్ణ





**పరిగి. మేజర్ న్యూస్ (జనవరి 30).** పరి మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు లో బిఆర్ఎస్ పార్టీ తరపున ఎదిరే పద్మ కృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎదిరే పద్మ కృష్ణ గతంలో పరిగి మేజర్ గ్రామ పంచాయతీ చివరి సమయ ంలో వార్డు సభ్యురాలిగా గెలిచి ఉపసర్పంచ్‌గా పనిచేశారు. తర్వాత పరిగి మున్సిపల్ గా ఏర్పడిన అనంతరం ఎదిరే పద్మ భర్త ఎదిరే కృష్ణ కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం 17వ వార్డు జనరల్ మహిళ రిజర్వేషన్ రావడంతో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గత పది సంవత్సరా లుగా ప్రజలకు తమ కుటుంబం చేస్తున్న సేవలు, అభివృద్ధి పనులే తమకు మళ్ళీ అవకాశం ఇస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది.

## తాండూరు పురపాలక పీఠం పై బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేస్తాం

**పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి రెండో సెట్టు నామినేషన్ వేసిన పట్లోళ్ల ఫ్యామిలీ**



**తాండూరు మేజర్ న్యూస్( జనవరి 30):** తాండూరు మున్సిపల్ పీఠంపై బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేస్తాం అని ఆ పార్టీ తరపున ఛైర్మన్ గా పోటీ చేస్తున్న సాయిపూర్(10 వ వార్డు)కు చెందిన పట్లోళ్ల నర్సింహులు పేర్కొన్నారు. సాయిపూర్‌లోని తమ నివాసం నుండి శు క్రవారం నాడు ఉప్పల్ కార్యాలయానికి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి రెండోవ నామినేషన్ సెట్టును తన సతీమణి తోపాటు తాను వేరువేరు వార్డులకు నామినేషన్ వేశారు.ఇందులో 10 వ వార్డు నుండి నరసింహులు,9వ వార్డు నుంచి తన సతీమణి ఐన మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ దీప నర్సింహులు వేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ మున్సిపల్ లోని 36 వార్డులల్లో అత్యధిక వార్డులను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకొని ఛైర్మెన్ పీఠాన్ని దక్కించుకుంటామని ఆయన పేర్కొన్నారు.అన్ని వార్డులల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఆయన అన్నారు.తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సహకారం, పార్టీ అండదండలతోని ముందుకు సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ర్యాలీ కార్యక్రమం తోపాటు నామినేషన్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు శ్రీశైల్ రెడ్డి,రాజు గౌడ్,శ్రీనివాస్ చారి తోపాటు వివిధ వార్డుల నుండి పోటీలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు,తదితరులు పాల్గొన్నారు.



# పోలింగ్ సిబ్బందికి మొదటి స్థాయి శిక్షణ పూర్తి

- ఎన్నికల నిర్వహణలో ప్రతి ఓటు కీలకం
- జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 30):** తెలంగాణ వ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలకు జరుగనున్న సాధారణ ఎన్నికలు?2026లో భాగంగా మేడ్చల్?మల్కాజిగిరి జిల్లాలోని ఆలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ శిక్షణను మాస్టర్ ట్రైనర్లు మురళీ, వేణులు అందించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికలకు ఉపయోగించే సామగ్రి సేకరణ విధానం, పోలింగ్ జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను అప్పగించే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు ఖచ్చితంగా ఉండేలా చూడాలని సూచించారు.ఎన్నికల్లో ప్రతి ఓటు అత్యంత కీలకమని, పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ట్రైనింగ్ నిర్వహణ నోడల్ అధికారి ఐ.విజయ కుమారి, బ్యాలెట్ బాక్స్ నిర్వహణ నోడల్ అధికారి సాంబశివ రావు, పోస్టల్ బ్యాలెట్ పేపర్ నోడల్ అధికారి ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.






# బిల్‌కల్‌లో యువకుని దారుణ హత్య





**మర్పల్లి మేజర్‌న్యూస్ (జనవరి30):** మర్పల్లి మండలంలోని బిల్‌కల్ గ్రామంలో శుక్రవారము రాత్రీ ఓ యువకుని పొలంలో హత్య చేసి నిందితులు పారి పోయి నట్లు గ్రామస్తులు తెలిపారు. మర్పల్లి మండలంలోని బిల్‌కల్ గ్రామ శివారులోని ఈడిగి చెంద్రయ్య నీటి జొన్న పొలంలో అదే గ్రామానికి చెందిన ఈడిగి నర్సిములుగౌడ్( 35)అనే యువకుడు విగత జీవిగా పడి ఉన్నాడనీ ఉదయం పొలం యజమాని జొన్నకు నీళ్ళు పెట్టడానికి వెళ్ళగా నర్సిములు మృతి చెంది రక్తపు మడుగులో పడిఉన్న దృశ్యాన్ని చూసి చుట్టు పక్కల గ్రామస్తులకు తెలిపారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా సంఘట నా స్థలానికి సి.ఐ వెంకట్,యస్,ఐ అబ్దుల్‌రహూఫ్‌లు,తమ సిబ్బందితో వెళ్ళి చూసి డాగ్‌స్కాడ్‌ను పిలిపించి పరీక్షించగా డాగ్‌స్కాడ్ ఓ వెంచర్‌గుండా వెళ్ళి ఓ పొలంలోని గుడిసెలో అన్నం తిన్న ఇస్తరాకులను నాకి రావడంతో పొలం యజమానులను పిలిపించి విఛారణ చేస్తున్నట్లు తెలిసింది. నింధితులను అప్పచెప్పాలి బందువు ఆంధోళన; నర్సిములు గౌడ్‌ను హత్య చేసిన నిందితులను పట్టించిన తరువాతనే శవపంచనామ చెయ్యాలనీ లేనిచో కదులనివ్వమ నీ మృతుడి బందువులు ఆందోళనకు దిగారు దాంతో యస్ఐలు ర హూఫ్,వినోద్‌లు వారికి నచ్చ చెప్పి నిందితులను పట్టుకుంటామనీ హీమి ఇవ్వడంతో వారు శాంతించారు.శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం మర్పల్లి ఆసుపత్రికి తరలించారు. నెలలోపే రెండు హత్యలు?శాంతి భద్రతలకు విఘాతం. మర్పల్లి మండలంలో జనవరిలోపే రెండు హత్యలు జరగడంతో శాంతి భద్రతలు విఘాతం కలుగుతుందనే కొన్ని ఆరోపనలున్నాయి.జనవరి 16న సంక్రాంతి కనుమపండుగ రోజే రావులపల్లి గ్రామంలోని ఓ ఫాంహౌజ్‌లో ఓ వ్యక్తి అనుమాన స్పదంగా పడి మృతి చెందాడు కొందరు అనుమానితులను అదుపులోని తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు అది ఇంతకు తేలలేదు?ఇక ఈరోజు బిల్‌కల్‌లో ఓ యువకుడిని దారుణంగా రాళ్ళతో తల పై కొట్టి అతి కిరాతకంగా చంపినట్లు కుటింబికులు తెలిపారు మృతుడకి ఓ మహిళతో అక్రమ సంబందం ఉన్నట్లు కొందరు గ్రామస్తులు గుసగుసలాడుకోవడం గమనార్హం.మృతుడి భార్య చేరాల వసంత ఫిర్యాదు మెరకు పోలీసులు కేసునమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తూన్నారు.



# ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి







**తాండూర్ రూరల్, మేజర్ న్యూస్ (జనవరి 30):** తాండూరు మండల పరిధిలోని ఖాంజాపూర్ గ్రామంలో వెలిసిన మైసమ్మ జాతర ఉత్సవాలలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా బిజ్వార్ గ్రామంలో మల్లికార్జున భ్రమరాంబ కళ్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ రవి గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, హై కోర్ట్ అడ్వకేట్ బసవరాజ్, హనుమంతు, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళి గౌడ్, ఖాజాపూర్ వెంకట్ రెడ్డి, సాయిపూర్ నరసింహులు, కిష్టప్ప, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com



## శ్రీ మల్లికార్జున స్వామి30వ వార్షికోత్సవం...

- **ఘనంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం**
- **ఆలయ ధర్మకర్త కురువ క్రిష్టప్ప**





**తాండూర్ రూరల్, మేజర్ న్యూస్( జనవరి 30) :** తాండూరు మండలం బొంకూర్ బిజ్వర్ గ్రామపంచాయతీ లో వెలిసిన శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం( శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి (30వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త కురువ కిష్టప్ప జాతర ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం బొంకూర్ బిజ్వార్ గ్రామ మహిళలు గ్రామం నుండి బోనాలతో శ్రీ మల్లికార్జున బ్రమరాంబ కళ్యాణోత్సవానికి హాజరయ్యి నైవేద్యాలు సమర్పించారు. ముందుగా ఆలయ ధర్మకర్త కురువ విజయ, కురువ కిష్టప్ప దంపతులు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు.అనంతరం గ్రామంలోని పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనసూయ కుమారుడు హైకోర్టు లాయర్ బసవరాజ్, రఘుపతి రెడ్డి హనుమంతు ,మాజీ సర్పంచ్ సాయిలు, వెంకట్ రెడ్డి, బిచ్చిరెడ్డి రెడ్డి, బుగ్గయ్య మల్లప్ప, మల్లప్ప, బి రాములు, వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు పాల్గొని దేవుడి కృపలో పాల్గొన్నారు.

## గాంధీకి ఘన నివాళి



**కీసర, మేజర్ న్యూస్ (జనవరి 30):** గాంధీ మహాత్మున్ని ఆదర్శంగా తీసుకుని ఆయన చూపిన బాటలో నేటి యువత పయనించాలని మెడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్త పేర్కొన్నారు. 79వ మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కీసరలోని గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బల్లి శ్రీనివాస్ గుప్త, ప్రధాన కార్యదర్శి బచ్చు నాగేష్ గుప్త, మెంబర్ షిప్ కమిటీ సభ్యులు పెరిమాల అనిల్ బాబు, కీసర గుట్ట నిత్యాన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు రాయల భాస్కర్ గుప్త, సిద్దిపేట జిల్లా మహాసభ ప్రదాన కార్యదర్శి హరినాథ్ గుప్త, గ్రాూ మహేష్ గుప్త, అడిషనల్ కార్యదర్శి కేదారి, కీసర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదే రాజు గుప్త, కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్ ముదిరాజ్, నాయకులు కానుకుర్తి కృష్ణ, సుమన్ బన్నీ, చిక్కుడు రమేష్ ముదిరాజ్, రాజయ్య పలువురు పాల్గొన్నారు.

## నేడు శని త్రయోదశి



**మోమిన్ పేట్ ,మేజర్ న్యూస్( జనవరి30):** మోమిన్ పేట మండల వరిధిలోని ఎన్కతల గ్రామంలో వెలసిన శ్రీ శనేశ్వర స్వామి దేవాలయంలో శనివారంశని త్రయోదశి పురస్కరించుకొని తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

## తాండూరు ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి జరిగింది నా హయాంలోనే

- **తాజా మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వెల్లడి**



**తాండూరు మేజర్ న్యూస్(జనవరి 30):** తాండూరు పట్టణం తోపాటు నియోజకవర్గం అన్ని రంగాలలో ఐదేళ్ళ పాటు నా హయాంలోనే అభివృద్ధి జరిగిందని తాండూరు తాజా మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు.లోకల్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి,ఆయన అనుచరులు పాల్పడుతున్న అరాచకాలకు, ఎదిరింపులకు కళ్లెం వేద్దాం అని ఆయన అన్నారు.తాండూరు పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల నిధులతో తాండూరు పట్టణంలోని 36 వార్డులలో ఎంతో అభివృద్ధి చేశానని,తన హయాంలోనే మంజూరైన నిధులతోనే ఇప్పటి ఎమ్మెల్యే పనులు కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు.మున్సిపల్ ఎన్నికల తర్వాత అభివృద్ధి విషయంపై ఎక్కడ చర్చ ఏర్పాటు చేసిన అభివృద్ధిని నిరూపిస్తానని ఆయన అన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేస్తాం అని రోహిత్ రెడ్డి పేర్కొన్నారు.36 వార్డులల్లో అత్యధిక స్థానాలను గెలుపొందుతాం అని,ఇందులో ఎలాంటి సందేహం లేదని మున్సిపల్ చైర్మన్ గా పట్లోళ్ల నర్సింహులు పదవిలో కూర్చుంటాడని ఆయన అన్నారు.ఎమెల్యే మనోహర్ రెడ్డి మునిసిపల్ లో 30 సీట్లు గెలుస్తామని చెపుతున్నాడని,అన్ని సీట్లు గెలవకపోతే రాజీనామా చేస్తావా అని రోహిత్ రెడ్డి సవాలు విసిరాడు.ఎమెల్యే తోపాటు వారి అనుచరులు దౌర్జన్యాలకు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎక్కడ చూసినా ఇసుక,ఎర్రమట్టి అక్రమ వ్యాపారమే సాగుతుందని ఆయన అన్నారు.ప్రశాంతమైన తాండూరులో బీహార్,ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల పరిస్థితి కనిపిస్తుందని,ఎన్నికల ముందు 7 వ గ్యారంటీ గా ఉంటానని చెప్పి ఇప్పుడు చేసే పరిస్థితి ఇదేనా అని రోహిత్ రెడ్డి ప్రశ్నించారు.బుయ్యని కుటుంబం పాల్పడుతున్నా అరాచకాల మూలంగా కాంగ్రెస్ పార్టీ లో ఉన్న నేతలు చాలా మంది ఆ పార్టీని వీడుతున్నారని,ఇందులో భాగంగానే డాక్టర్ సంపత్ కూడా రాజీనామా చేశాడని రోహిత్ రెడ్డి అన్నారు.తాండూరు పట్టణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీ పట్ల ఎంతో ఆదరణ చూపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున చైర్మెన్ గా పోటీచేస్తున్న పట్లోళ్ల నర్సింహులు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు:శ్రీశైల్ రెడ్డి,రాజు గౌడ్,శ్రీనివాస్ చారి,ఆసిఫ్,రఘు,సలీం, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడా పోటీలు



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (జనవరి 29):** గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని డిసిసి ఉపాధ్యక్షుడు బోలుసాని భీంరెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ నాయక్, తాహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంఈఓ హబీబ్ అహ్మద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడలను వారు ప్రారంభించి మాట్లాడారు. పల్లెలోని యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని, దీనివల్ల శారీరక దృఢత్వంతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా లభిస్తుందన్నారు. అలాగే తాము ఎంచుకున్న క్రీడల్లో కష్టపడి రాణిస్తే పల్లె స్థాయి నుండి ప్రపంచ స్థాయి ఛాంపియన్లుగా ఎదుగొచ్చన్నారు. సీఎం కప్ క్రీడల ద్వారా ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు క్రీడా ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదికను కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి, జిల్లా యువ నాయకులు కుమ్మరి స్వామి,స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మండల నాయకులు జోగు వెంకటయ్య గౌడ్, మహేష్, పిఈటిలు సుభాష్, ప్రవీణ్, కేశవులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన డాక్టర్ సంపత్ కుమార్

- **స్నేహం కోసం పార్టీకి గుడ్ బై చెప్పిన డాక్టర్.**
- **గత 15 రోజుల క్రితమే “సూర్య”వెల్లడించిన కథనం.**



**తాండూరు మేజర్ న్యూస్ (జనవరి 30):** తాండూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మరియు ప్రముఖ డాక్టర్ ఐన డా?సంపత్ కుమార్ శుక్రవారం నాడు సాయంత్రం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.కాంగ్రెస్ పార్టీకి డా?సంపత్ కుమార్ రాజీనామా చేస్తున్నట్లు జనవరి 15 వ తేదీన సూర్య దినపత్రిక వెల్లడించిన విషయం తెలిసిందే. తాండూరు పట్టణంలోని సాయిపూర్ కు చెందిన పట్లోళ్ల నర్సింహులు బిఆర్ఎస్ పార్టీ నుండి చైర్మెన్ గా పోటీలో ఉన్నందున ఆయనకు మద్దతు తెలపాలని ఉద్దేశ్యం తోనే స్నేహం కోసం రాజీనామా చేశారు. డా?సంపత్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండడం, బీఆర్ఎస్ పార్టీ నుండి నర్సింహులు చైర్మెన్ గా పోటీలో ఉండడం తో కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి నర్సింహులుకు మద్దతు తెలపడానికి శ్రీకారం చుట్టారు.స్నేహం కోసం త్యాగం చేస్తున్నట్లు గతంలోనే సంపత్ కుమార్ వెల్లడించారు. వ్యక్తిగత కారణాలతోనే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు డా? సంపత్ వెల్లడిస్తున్నప్పటికీ ఎన్నో రాజకీయ కారణాలు ఉన్నట్లు చెప్పవచ్చు.గత శాసన సభఎన్నికల ముందు మనోహర్ రెడ్డి గెలుపు కోసం సంపత్ కుమార్ ఎంతగానో కృషి చేశారు.కొన్ని నెలల నుంచి డా?సంపత్ పార్టీకి దూరంగా ఉండడం,ఆ పార్టీ కి చెందిన బుయ్యని బ్రదర్స్ కూడా దూరంగా పెట్టడంతో చాలా వరకు మనస్పర్థలు ఏర్పడ్డాయి.ఇందులో భాగంగానే డా?సంపత్ కుమార్ రాజీనామాకు సిద్దమై పట్లోళ్ల ఫ్యామిలీ గెలుపు కోసం ముందుకు వస్తున్నట్లు చెప్పవచ్చు.తన స్నేహితుని గెలుపు కోసం రాజీనామా చేయగా తప్పలేదని పట్లోళ్ల ఫ్యామిలీ ని గెలిపించుకొని తమ సత్తా చూపుతానని డా?సంపత్ కుమార్ ఈ సందర్భంగా సూర్య ప్రతినిధితో వెల్లడించారు.

## కాంట్రాక్టర్ సత్తిరెడ్డికి బకాయిలు ఇప్పిస్తాం

- **మరో నాలుగు నెలల్లో రైల్వే ఫ్లై ఓవర్ పూర్తి చేయిస్తాం**
- **ఘట్‌కేసర్, మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్**



**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(జనవరి, 30):** మరో నాలుగు నెలల్లో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తవుతుందని, ప్రజలెవరు ఆందోళన చెందవద్దని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద కాంట్రాక్టర్ సత్తిరెడ్డి, ఆర్ అండ్ బి ఏఈ సింధు ప్రియతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, పార్టీల పోరాటాలతో మంజూరైన రైల్వే బ్రిడ్జి పనులు రెండు దశాబ్దాలు కావస్తున్న పూర్తి కాకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, ఆరేండ్ల క్రితం మున్సిపల్ పాలకవర్గం ఏర్పడగా చైర్ పర్సన్ గా తాను పాలకవర్గ సభ్యుల సహకారంతో బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేస్తూ వచ్చినట్లు గుర్తు చేశారు. నాటి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఎమ్మెల్యే, మంత్రులు, అధికారుల వద్దకు వెళ్లి తొలగింప చేశామని, నూతన కాంట్రాక్టర్ సత్తిరెడ్డి నిర్మాణ పనులను వేగవంతం చేశారని, సత్తిరెడ్డికి ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలను డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో త్వరలోనే ఇప్పించి మరో నాలుగు నెలల్లో పూర్తిచేసేలా కృషి చేస్తానన్నారు. దీనికి అన్ని పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జంగయ్య యాదవ్, కే. మల్లేష్, బొక్క ప్రభాకర్ రెడ్డి, ఖయ్యూం, సిరాజ్, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.